క్లుప్తంగా

రేపు ఖాజీపాలెంలో 'సురక్ష' వైద్య శిబిరం

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు లీలాక్రాంత్ కర్మల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న వైద్య శిబిరంలో ప్రత్యేక వైద్యనిపుణులు పాల్గొని, వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం గ్రామంలోని డిగ్రీ కళాశాలలో సోమవారం మధ్యాహ్నం వ్యాసరచన వక్తృత్వం పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ ఆదివారం తెలిపారు. శ్రీ మంతెన వెంకటరాజు ఫౌండేషన్ సౌజన్యంతో ఆచార్య నాగార్జున, కృష్ణా, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయాల అంతర్ కళాశాలల స్థాయిలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలలో విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టొబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు పాల్గొంటారని తెలిపారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ జయంతి

రేపల్లె రూరల్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పాల్గొని, మహాత్మునికి ఘన నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

తీరంలో చెత్తాచెదారం తొలగింపు

బాపట్ల: పరిశుభ్రత కోసం శ్రమదానం చేయటం ఎంతో మంచి విషయమని మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోది పిలుపు మేరకు బీజేపీ యువ మోర్చా ఉపాధ్యక్షుడు బి.కృష్ణచైతన్య ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పార్టీ నాయకులు సూర్యలంక సముద్ర తీరంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ తీర ప్రాంతంలో చెత్తాచెదారం తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



భట్టిప్రోలు: మండలంలోని 12 సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఆదివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఉదయం 5 నుంచే గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. సందర్భంగా ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు మాట్లాడుతూ మండలంలో మొత్తం 8,648 ఫించన్లకు గాను సాయంత్రానికి 6,029 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు.

స్వచ్ఛమైన ఆలోచనలతోనే అసలైన స్వచ్ఛభారత్ సాధ్యం



గుంటూరు రూరల్: స్వచ్ఛమైన ఆలోచనలతోనే అసలైన స్వచ్ఛభారత్ సాధ్యమవుతుందని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా గ్రామంలోని వీధులను శుభ్రపరిచారు. ఆయన మాట్లాడుతూ నాగరికతతో పాటు ప్రజల జీవనశైలిలో అనేక మార్పులు జరిగి వివిధ రకాల వస్తువుల వినియోగం విపరీతంగా పెరిగిందన్నారు. అనవసరపు వస్తువులను ఉపయోగించడం వలన వాటి తాలూకు వ్యర్థాలు కూడా పేరుకుపోతున్నాయన్నారు. ఆ వ్యర్థాలను సక్రమంగా శుభ్రం చేసుకోలేక ఎక్కడపడితే అక్కడ వదిలివేస్తున్నామని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్రత అనేక అనారోగ్యాలకు కారణమవుతుందని చెప్పారు. మన పక్క దేశాలైన శ్రీలంక, చైనా లాంటి దేశాలలో మనకంటే పరిశుభ్రత ఎక్కువగా పాటిస్తారని వివరించారు. పరిశుభ్రత గురించి, కాలుష్యం గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంతటి వాడే చెప్పవలసి వచ్చిందంటే మన మెదడులు ఎంత కల్మషంగా తయారయ్యాయో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధి సుంకర నాగభూషణం, శ్రీకాంత్‌రెడ్డి , పుల్లడిగుంట ప్రెసిడెంట్ సైయద్ పర్వీన్, రైతునేస్తం సిబ్బంది పాల్గొని దగ్గరలోని ప్రాంతాలను శుభ్రం చేశారు.

భవిష్యత్ తరాలకు స్వచ్ఛ భారతావని అందించాలి



రేపల్లె పట్టణ ప్రధాన రహదారిని శుభ్రపరుస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె: భవిష్యత్తు తరాలకు స్వచ్ఛ భారతావనిని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మునిసిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపులో భాగంగా పట్టణంలో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. మొక్కలు నాటటంతో పాటు వాటిని రక్షించి, పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. అప్పుడే వాతావరణంలో ఆక్సిజన్ పెంపొందటమే కాకుండా ఓజోన్ పొర సైతం పరిరక్షించబడుతుందన్నారు. ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం పట్టణంలో పలు రహదారులను పరిశుభ్రపరిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, కమిషనర్ విజయసారథి, శానిటరి ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భట్టిప్రోలు పారిశుద్ధ్య కార్యక్రమాలు

భట్టిప్రోలు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి పారిశుద్ధ్య కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈఓపీఆర్డీ టి.ఉషారాణి ఆధ్వర్యంలో కార్యాలయ పరిసరాలను పరిశుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం కో–ఆర్డినేటర్ వెంకటేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, మండల పరిషత్ కార్యాలయ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, కార్యదర్శి కోటా శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు కొలుసు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, జి. అరవింద, దాసరి గోపాలరావు, పంచాయతీ సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. వెల్లటూరులో సర్పంచ్ చౌటూరి లక్ష్మి, కార్యదర్శి ఎ.రామ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు చౌటూరి రవీంద్ర ర్యాలీ నిర్వహించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

పిట్టలవానిపాలెం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కోమలి గ్రామ సర్పంచ్ శ్యామల నాగిరెడ్డి అన్నారు. కోమలి గ్రామంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి కుంభ శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చిమ్ముతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ..



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న గ్రామస్తులు

పరిశుభ్రతకు ప్రతిజ్ఞ

కొల్లూరు : గాంధీ జయంతిని పునస్కరించుకుని మండలంలోని కిష్కిందపాలెంలో పరిశుభ్రత శ్రమదానం ఆదివారం నిర్వహించారు. సర్పంచ్ గుంటూరు నీలాంబరం ఆధ్వర్యంలో స్థానిక సచివాలయంలో కార్యదర్శి షేక్ షరీఫ్ గ్రామస్తులతో.. పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలోని పలు ప్రాంతాల్లో గంట సమయం పరిశుభ్రత కోసం శ్రమదానం నిర్వహించి, పరిసరాలను శుభ్రపరిచారు.



ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచి, గ్రామస్తులు

అర్బన్ హెల్త్ సెంటర్‌లో పారిశుద్ధ్యం

రేపల్లె రూరల్: పట్టణంలోని గరువు రోడ్డులో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది అర్బన్ హెల్త్ సెంటర్ పరిసరాలను శుభ్రపరిచారు. వైద్యాధికారి జాన్ ప్రసాద్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మురళి, జితేంద్ర, జ్యోతి, సునీత పాల్గొన్నారు.

వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో..

బాపట్ల: బాపట్ల వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. చెత్తాచెదారం తొలగించటంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను నిరోధించాలని ప్రదర్శన చేపట్టారు. విద్యార్థులతోపాటు కళాశాల డీన్ డాక్టరు డి. స్మిత్, డాక్టర్ ఎం.మాధవ, ఆర్.గణేష్, కృపావతి, వీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లను పరిరక్షించుకోవాలి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



వైద్యశిబిరంలో ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: కళ్లను ప్రతి ఒక్కరూ పరిరక్షించుకోవాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలం కనగాల గ్రామంలో హాజీ షేక్ హసన్ అహ్మద్ అండ్ హాజీ షేర్ మహమ్మద్ అల్లాదీన్ స్మారకార్థం హాజీ మహమ్మద్ ఖాసీమ్ సాహెబ్ అండ్ మహమ్మద్ గాలబ్ సాహెబ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాలలో ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీ మోపిదేవి ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ అబ్దుల్ సమద్ మాట్లాడుతూ నేత్రాలకు ఎటువంటి సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించి, సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేదల కోసం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 199 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వీరిలో 151 మందికి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. వీరిని రెండు విడతలుగా ఈ నెల 3, 5తేదీలలో పెదకాకాని ఆసుపత్రికి తరలించి, ఉచితంగా ఆపరేషన్‌లు చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివకర రత్నప్రసాద్, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఫరూక్ అహ్మద్ పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్యపై కోళ్లపాలెం వాసుల వినూత్న నిరసన



నోటికి చేతిని అడ్డుపెట్టుకుని గ్రామస్తుల నిరసన

కోళ్లపాలెం(భట్టిప్రోలు): కోళ్లపాలెంలో శ్మశానవాటికకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున 3.20 ఎకరాల భూమిని కేటాయించి, సమస్యను పరిష్కరించారు. గ్రామానికి చెందిన కొంతమంది ఆ భూమిని శ్మశానవాటికకు ఇవ్వకుండా...అడ్డుపడటమే కాక కుల వివక్షత చూపడంతో ఆదివారం గ్రామస్తులు కుడి చేతితో నోరు మూసుకుని నిరసన వ్యక్తం చేశారు. శ్మశానవాటిక ఏర్పాటుకు అడ్డు పడటమే కాక నానా విధాలుగా దుర్భాషలాడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. తమ ప్రభుత్వం వచ్చాక అంతు చూస్తామని బెదిరిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. పెదపులివర్రు గ్రామానికి చెందిన సజ్జా మస్తాన్‌రావు, సజ్జా రాంబాబు, భావన్నారాయణ (వెంకట్రామయ్య)లు బెదిరింపు ధోరణికి పాల్పడుతున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నీలా నాగరాజు, గ్రామస్తులు నీలా రామకృష్ణ, కె.నాగరాజు, నీలా ధర్మారావు, ఎన్.పసి, కె.రామయ్య, జె.అబ్బులు, జి.గోవిందు, కె.నాగయ్య, జి.పూర్ణ, మల్లియ్య పాల్గొన్నారు.

వయో వృద్ధుల హక్కుల కోసం ప్రత్యేక చట్టాలు

2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత



సత్కార గ్రహీతలతో శ్రీసీత, అసోసియేషన్ నేతలు

తెనాలి: వయో వృద్ధులకు న్యాయపరమైన హక్కుల సాధనకు తగిన చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడి కవిరాజ పార్కులోని వీజేకే భవన్లో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా న్యాయమూర్తి హాజరై, వయోవృద్ధులకు సంబంధించిన చట్టాల్ని వివరించారు. సీనియర్ సిటిజన్లు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చారు. వృద్ధులకు సంబంధించిన కేసుల్ని త్వరితగతిన విచారించేందుకు తగిన వెసులుబాటు ఉందంటూ, ఆ వివరాలను తెలియజేశారు. తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా న్యాయ సలహాలు, సేవలు అందించడానికి మండల స్థాయిలో లీగల్ సెల్ అందుబాటులో ఉందని చెప్పారు. అవసరమైనవారు సేవల్ని వినియోగించుకోవాలని చెప్పారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అభివృద్ధికి డాక్టర్ నర్రావుల ఆదినారాయణ, సతీమణి లక్ష్మీసునీత రూ.10 వేల విరాళం ఇచ్చినందుకు సంఘం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. 75 ఏళ్లు నిండిన అయిదుగురు సభ్యులు, సహస్ర పూర్ణ చంద్ర దర్శనం చేసుకున్న మండలపు పూర్ణచంద్రరావును సత్కరించారు. సెప్టెంబరులో జన్మించిన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహబూబ్, చలమయ్య, హనుమారెడ్డి, సీతారామయ్య, రామకృష్ణ పాల్గొన్నారు. కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ప్రతి ఒక్కరిలో అంతర్గతంగా పరమాత్మ చైతన్యం

తెనాలి: ప్రతి ఒక్కరిలో అంతర్గతంగా పరమాత్మ చైతన్యం ఉంటుందని, దీన్ని అనుభూతి చెందే హక్కు ఎవరికి వారికి ఉంటుందని శ్రీమాతా రాజశ్యామల పీఠం, నిర్మల్ వ్యవస్థాపకుడు శివరాజయోగి కృష్ణ స్వామీజీ పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని శ్రీరాధాకృష్ణ కల్యాణ మండపంలో ఆదివారం మహాప్రాణవిద్య గురుదీక్షను నిర్వహించారు. పరమాత్మ చైతన్యాన్ని అనుభూతి పొందే దివ్య సాధనను మహాప్రాణవిద్య గురుదీక్ష రూపంలో శివరాజయోగి కృష్ణ స్వామీజీ శిష్యులకు అందించారు. తర్వాత ఆయన స్వయంగా ప్రతిష్ఠించీకరించిన పంచముఖ రుద్రాక్షను ప్రసాదంగా అందజేశారు. అన్నప్రసాద వితరణ చేశారు. నిర్వాహకులు శివలలిత, కవిత, శ్రీరాం, అనిత పాల్గొన్నారు.

శ్లాబ్ కూలి వృద్ధురాలికి తీవ్ర గాయాలు



కర్లపాలెం: పాత ఇంటి శ్లాబ్ కూలి పడి ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలైన ఘటన దుండివారిపాలెం పంచాయతీ పరిధిలోని బిడారు దిబ్బ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బిడారు దిబ్బ గ్రామానికి చెందిన కత్తి మార్తమ్మ శనివారం రాత్రి తన గృహంలో నిద్రకు ఉపక్రమించింది. భవనం పాతది కావటం వల్ల ఆదివారం తెల్లవారు జామున కురిసిన వర్షాలకు భవనం స్లాబ్ కూలి ఆమె మీద పడింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం గమనించిన స్థానికులు మార్తమ్మను 108 అంబులెన్స్‌లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మార్తమ్మ ఆరోగ్యం విషమంగా ఉందని వైద్యులు చెప్పినట్లు స్థానికులు తెలిపారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం) : చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అభయ ప్రధాయినిగా అలంకరించి, పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల వృథాను అరికట్టాలి

గుంటూరు రూరల్: పంట ఉత్పత్తులలో వృధాలను అరికట్టి అధిక లాభాలను సాధించవచ్చని ఉద్యాన శాఖ సహసంచాలకుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామంలోగల రైతునేస్తం ఫౌండేషన్‌లో సేంద్రియ ఉత్పత్తులు, వృధాలను అరికట్టే విధానంపై రైతు శిక్షణ సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన రైతులు చాలా నైపుణ్యవంతులని అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో పంటలలో అధిక దిగుబడులు సాధిస్తున్నారన్నారు. వచ్చిన దిగుబడులను సక్రమంగా అమ్ముకోలేకపోతున్నారని కొన్ని సమయాలలో వ్యవసాయ దిగుబడుల ధరలు విపరీతంగా తగ్గి రైతుకు సాగు గిట్టుబాటు కాని పరస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఇటీవల టమాటా ధరలు జూలై, ఆగస్టు మాసాల్లో విపరీతంగా పెరిగాయని, ప్రస్తుతం విపరీతంగా తగ్గాయన్నారు. ఈ పరిస్థితులు ఇదే విధంగా కొనసాగితే రైతులు పంటల సాగును పక్కకు పెట్టి వేరే మార్గాలు వెతుక్కునే అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. సేంద్రియ సాగు విధానం, కషాయాలు, మిశ్రమాల తయారీని వివరించారు. అనంతరం రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ రైతులు శబరీనాథ్, ఏడుకొండలు, శివనాగమల్లేశ్వరరావు రైతునేస్తం ఫౌండేషన్ చెర్మన్ వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- గూడవల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

గూడవల్లి(చెరుకుపల్లి): పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. గూడవల్లి గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలను ఎంపీ మోపిదేవి ఆప్యాయంగా పలకరించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుంటే సాంకేతిక కారణాలేమైనా ఉన్నాయా అని పరిశీలించాలని వలంటీర్లకు సూచించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల్లో ఆత్మ విశ్వాసం రెట్టింపు అయ్యిందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు పార్టీ, కుల, మత, వర్గ విభేదం లేకుండా అందరికి సంక్షేమ పథకాలు అందించడం తమ ప్రభుత్వానికే చెల్లిందని మోపిదేవి అన్నారు. సచివాలయాల ద్వారా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ అడ్రస్సు గల్లంతవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పయనం ఏడుకొండలురెడ్డి, సర్పంచ్ నలిగిల నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు గొరిదేవి ఏసుబాబు, మైనార్టీ నాయకులు వాహెబ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలుమూరు ఆలయంలో హుండీ చోరీ



పంట పొలాల్లో ఆలయ హుండీ

కొల్లూరు : ఆలయ తాళాలు పగలగొట్టి, హుండీ చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. చిలుమూరు కరకట్ట వెంబడి గత వేసవిలో ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి, పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్వాహక కమిటీ ఆ ప్రాంతంలో హుండీ ఏర్పాటు చేసింది. శుక్రవారం అర్ధరాత్రి హుండీని భద్రపరిచిన గది తాళాలు పగలగొట్టి.. దుండగులు హుండీని ఎత్తుకెళ్లారు. తొలుత స్థానిక కొత్త చిలుమూరులో పేరంటాళమ్మ ఆలయం తలుపులు పగలగొట్టి, దొంగతనానికి ప్రయత్నించిన దొంగలు.. అక్కడు ఏమీ లభ్యం కాకపోవడంతో.. కరకట్ట వెంబడి ఉన్న ఆంజనేయుడి ఆలయంలో హుండీని దొంగిలించారు. చిలుమూరు–ఈపూరు మధ్య సున్న పంట పొలాల్లో హుండీని తెరచి అందులో ఉన్న నోట్లను తీసుకుని, చిల్లర అక్కడే వదిలి వెళ్లారు. శనివారం హుండీ దొంగతనం విషయం గమనించిన నిర్వాహకులు కొల్లూరు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. చిలుమూరులో ఇటీవల వరుస దొంగతనాలు చోటు చేసుకుంటుండటంతో స్థానికులు, పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గత నెలలో దుకాణంలో చోరీ చేసి దగ్ధం చేయడంతో పాటు, మరో గృహంలో కోళ్లను, పెంపుడు కుక్కను ఎత్తుకెళ్లారు. కొల్లూరులో కూడా ఇటీవల చోరీలు అధికమవుతున్న నేపథ్యంలో పోలీసులు రాత్రిళ్లు నిఘా పటిష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఏపీటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కిరణ్, శ్రావణ్ కుమార్



ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు

నిజాంపట్నం: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్)మండలశాఖ అధ్యక్షుడిగా కుర్రా కిరణ్, ప్రధాన కార్యదర్శిగా ఆలపాటి శ్రావణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీటీఎఫ్ మండల నూతన పాలక మండలి కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక ఫెడరేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా కె.విజయ్ గోపాల్, మండల అధ్యక్షుడిగా కుర్రా కిరణ్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసరావు, మీరా, రజినీ, ప్రధాన కారదర్శగా ఆలపాటి శ్రావణ్ కుమార్, కార్యదర్శులుగా రాంబాబు, రమేష్, తిరుమల లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్‌లుగా రామాంజనేయులు, మనోహర్, సుబ్రహ్మణ్యం, కరిముల్లా బేగ్, శ్రీలత, రషీద్‌లను ఎన్నుకున్నారు. మరో 10 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. జంపాని శ్రీనివాసరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల పక్షాన ఎనలేని పోరాటం చేస్తుందని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడేందుకు తమవంతు కృషి చేస్తామని చెప్పారు.

ఆరోగ్య బీమా కార్డుతో పలు ఉపయోగాలు

- ఐఎంఏ తెనాలి అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి
- ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ క్యాంపులో 312 మందికి కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి

తెనాలి: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అందిస్తున్న ఆరోగ్య బీమా కార్డు బ్యాంకు లాకర్లో దాచుకున్న డబ్బుతో సమానమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), తెనాలి అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రత్నా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ఆరోగ్య బీమాకు ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషను శిబిరం నిర్వహించారు. సభకు సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్డ్ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యసేవల్ని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అందిస్తుందని చెప్పారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఇంటెన్సివ్ కేర్ సదుపాయాలను ఈ కార్డుతో పొందవచ్చని చెప్పారు. ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ కె.అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డ్ ఆయుషును పెంచే సంజీవనిగా చెప్పారు. కార్డుదారులు మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్లో ఉచితంగా వైద్యాన్ని పొందవచ్చని చెప్పారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ పెన్నీ మినిస్ట్రీస్ సేవల్ని అభినందించారు. రిజిస్ట్రేషన్ అనంతరం మొత్తం 312 మందికి ముఖ్య అతిథులతో ఆరోగ్య బీమా కార్డులను పంపిణీ చేయించారు. కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు దాసరి శివనారాయణ, మిలటరీ ప్రసాద్, పోగర్తి రాజేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కిరాణా షాపును ప్రారంభిస్తున్న చల్లా రామయ్య

బాపట్ల: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య పేర్కొన్నారు. జగనన్న చేదోడులో లబ్ధి చేకూరిన దక్కుమాళ్ళ కుమారి ఏర్పాటు చేసుకున్న కిరాణా షాపును ఆదివారం ప్రారంభించారు. స్థానిక వెదుళ్ళపల్లి రామయ్య వికలాంగుల కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే కోన రఘుపతి చూపిన చొరవ, దివ్యాంగులకు సంక్షేమ కార్యక్రమాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ మరిచిపోలేమని తెలిపారు. దివ్యాంగులకు మరెన్నో సంక్షేమ కార్యక్రమాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల నాయకులు గుంజి ఏడుకొండలు, భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చల్లపల్లి గోపీ, షేక్ నీలిమ పాల్గొన్నారు.